అంగన్‌వాడీ కేంద్రం పిల్లల భవితకు పునాది



చొప్పదండి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


గంగాధర మండలం మల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


మానకొండూర్: ఖాదర్‌గూడెంలో..


గన్నేరువరంలో..

మానకొండూర్: మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామంలో సోమవారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ రేణుక ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, ప్రైవేటు పాఠశాలలకు పంపొద్దని సూచించారు. మహిళలు, చిన్నారులు, ప్లకార్డులు చేతపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

గన్నేరువరం: అంగన్‌వాడీ కేంద్రం పిల్లల భవితకు పునాది అని అంగన్‌వాడీ టీచర్ రేణుక అన్నారు. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

చొప్పదండి: పట్టణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట.. అనే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీని ప్రారంభించి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, పీఈటీ కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.రమాదేవి, పి. రేణుక, సాయికృష్ణ, సాగర్, మల్లీశ్వరి, రజిత, లలిత, భాగ్యలక్ష్మి, కోమల, సుజాత, స్వరూప, రాజ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఐసీడీఎస్ ఆధక్వర్యంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అర్హులైన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సీడీపీవో సౌందర్య సూచించారు. ఆటపాటల ద్వారా విద్యార్థులను పాఠశాలకు వెళ్లడానికి సిద్ధం చేస్తారని, పౌష్టికాహారం అందిస్తారని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంజిరెడ్డి, రాజేశం, సూపర్‌వైజర్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి శారద, అంగన్‌వాడీ టీచర్లు రమణ, కవిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాయబ్ తహసీల్దార్‌గా నరసింహచారి


నరసింహచారిని సన్మానిస్తున్న తహసీల్దార్ భిక్షపతి, కార్యాలయ సిబ్బంది

గన్నేరువరం: గన్నేరువరం మండల నాయబ్ తహసీల్దార్‌గా నరసింహచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సైదాపూర్ మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి నాయబ్ తహసీల్దార్ సందీప్ డిప్యూటేషన్‌పై వెళ్లగా 11 నెలల నుంచి పోస్ట్ ఖాళీగా ఉంది. ఈ సందర్భంగా తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ రజినీస్‌కుమార్, కార్యాలయ సిబ్బంది వారిని శాలువాల సన్మానించారు.

చిగురుమామిడి మండలంలో టీచర్ల బదిలీలు పూర్తి

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో 21 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 29 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. ఇతర పాఠశాలల నుంచి వచ్చినవారు ఆయా స్కూళ్లలో చేరారు. అలాగే గత నెలలో తొమ్మిది ప్రభుత్వ జెడ్పీపాఠశాలల్లోని 40 మంది ఉపాధ్యాయులు ఇతర పాఠశాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో బదిలీపై వచ్చినవారు విధుల్లో చేరారని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

గన్నేరువరంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

గన్నేరువరం: మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గన్నేరువరంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గ్రంథాలయ ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల గ్రామాల యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పత్రికలు చదవడంతో జనరల్ నాలెడ్జ్, ఇతర విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. గన్నేరువరం మండలంగా ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా గ్రంథాలయం లేకపోవడం బాధగా ఉందని, వెంటనే ఏర్పాటు చేయాలన్నారు.

మంచి లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కల్పన

హుజూరాబాద్: విద్యార్థులు మంచి లక్షణాలు పెంపొందించుకోవాలని ప్రజామిత బ్రహ్మకుమారి శిష్య–రాయ విశ్వవిద్యాలయం హుజూరాబాద్ ఇన్‌చార్జి కె. కల్పన సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నిర్మల అధ్యక్షతన విద్యార్థులకు వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా వివిధ అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు కమ్యూనికేషన్, టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, లీడర్లు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శిరిష మావయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వెంట బండ శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు తదితరులు ఉన్నారు.


పరమేశ్వరి చాలీసా పారాయణం



చొప్పదండి: మండల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని భక్తులు వాసవీ పరమేశ్వరి మాత చాలీసా పారాయణం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు 41 రోజుల పాటు కార్యక్రమం నిర్వహించనున్నారని, వైశ్య భవన్‌లోని కన్యకా పరమేశ్వరి మాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల వరకు పారాయణం కొనసాగుతుందని తెలిపారు.

పింఛన్ ఇప్పించండి సార్లు

- రెండేళ్లుగా ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణ
- కనికరించని అధికారులు



డిసెబిలిటి ఐడీ కార్డు(ఇన్‌సెట్లో) కొత్త రాజయ్య



రామడుగు: రెండేళ్ల క్రితం 70 శాతం వైకల్యం ఉన్నట్లు అధికారులు ధృవీకరణ పత్రం జారీశారు. అయినా ప్రభుత్వం నుంచి ఫించన్ అందకపోతుండటంతో కొత్త రాజయ్య(58) దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాడు. మండలంలోని షానగర్ గ్రామానికి చెందిన రాజయ్య ఎడమ కాలికి గాయం కావడంతో వైద్యులు మోకాలు వరకు తొలగించారు. వికలాంగుల ఫించన్ కోసం సదరం క్యాంపుకు హాజరుకావడంతో కరీంనగర్‌లో పరీక్షలు నిర్వహించిన వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి పంపించారు. పలు రకాల పరీక్షలు నిర్వహించి 2022 ఆగస్టులో వైకల్యం ఉన్నట్లు ధృవీకరణ పత్రం అందజేశారు. ఫించన్ కోసం మీ సేవాలో పేరు నమోదు చేసుకున్నా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నాడు. అయినా ఫించన్ రావడం లేదని సాక్షికి తన ఆవేదన వెలిబుచ్చాడు.

‘అమ్మ ఆదర్శ’ పనులు పూర్తి చేయాలి

- డీఈవో జనార్దన్‌రావు


నవాబుపేట్ బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు గిఫ్ట్ అందిస్తున్న డీఈఓజనార్దన్‌రావు

చిగురుమామిడి: జిల్లా వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లోని పనులను సత్వరం పూర్తిచేసి ప్రభుత్వం ఇచ్చే గిఫ్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు అన్నారు.మండలంలోని నవాబుపేట్ బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పనులు సకాలంలో పూర్తి చేసినందుకు సోమవారం స్పోర్ట్స్ గిఫ్ట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన చేయాలని, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యార్థులకు ప్రభుత్వం సకల సౌకర్యాలను కల్పిస్తుందని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడులకే పంపించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మంగ, వీఓ అధ్యక్షురాలు, నవాబుపేట్ జెడ్పీపాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజయ్య, ఉపాధ్యాయులు సునీత ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో సోమవారం సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటి ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత సమాచారం అపరిచిత వ్యక్తులకు చెప్పొద్దని సూచించారు. మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సైలక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నోట్‌బుక్స్, డ్రెస్‌లు పంపిణీ


కొండాపూర్ కాశవాడ ప్రాథమిక పాఠశాలలో నోట్‌బుక్స్, డ్రెస్‌లు పంపిణీ చేస్తున్న టీచర్లు

చిగురుమామిడి: మండలంలోని 34 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 2300 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుంచి 12,000 నోట్‌బుక్స్ అందజేయగా ఆయా పాఠశాలల టీచర్లు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఏటా రెండు జతల దుస్తులు (స్కూల్ యూనిఫాం) అందజేయగా ఒక జత మాత్రమే పంపిణీ చేశారు. మరో జతకు అధికారులు కొలతలు తీసుకున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు షూ ఇచ్చేందుకు హామీ ఇచ్చారు.

పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహించొద్దు

- సమస్యల పరిష్కారానికి కృషి
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

గన్నేరువరం: గురుకుల పాఠశాలలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే తనఖీ చేశారు. పాఠశాలలో సరియైన సదుపాలయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు పలుమార్లు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. బెంచీలు, బెడ్స్‌తో పాటు అద్దె భవనం కావడంతో వసతులు సరిగా లేవని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండి అపరిశుభ్రంగా ఉండటంతో బీసీ వెల్ఫేర్ అధికారులకు ఫోన్ చేసి అసహనం వ్యక్తం చేశారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పది రోజుల్లో పాఠశాలను సందర్శిస్తానని, వర్షాకాలంలో నేపథ్యంలో పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. సమస్యలను బీసీ సంక్షేమశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ బెజ్జంకి మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి ముల్కల మల్లేశం, కిసాన్ సెల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నల్లా చంద్రారెడ్డి, మాతంగి అనిల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తిప్పర్తి పరిపూర్ణాచారి, గ్రామశాఖ అధ్యక్షుడు చితంల శ్రీధర్‌రెడ్డి, న్యాత జీవన్, చందు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

చొప్పదండి: పట్టణంలో సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఎనిమిదో వార్డులో సోమవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఖాళీ స్థలాలు, డ్రైనేజీల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజన్నల రాజు, మహేశ్, మనోహర్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ శ్రీపతి నరేశ్

జమ్మికుంట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆరోవార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో సోమవారం మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

మొక్కలు, విత్తనాలు..


మొక్కలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సుదర్శనం

మానకొండూర్: మండలంలోని అన్నారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం సుదర్శనం సోమవారం పాఠశాల ఆవరణలో కూరగాయల విత్తనాలతో పాటు మొక్కలు పంపిణీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. పకృతి, మొక్కల పెంపకం పట్ల విద్యార్థుల్లో అభిరుచి కలిగించేందుకు కార్యక్రమం చేపట్టామని, కూరగాయల మొక్కలు ఇంటి చుట్టూ పక్కల పెంచితే రసాయన రహిత కూరగాయలు పొందవచ్చన్నారు. మాజీ సర్పంచ్ కిషన్, ఉప సర్పంచ్ మహేందర్‌రెడ్డి, ఎంపీటీ రాజనర్సు, శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు అందజేస్తాం


మాట్లాడుతున్న కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య

జమ్మికుంట: పట్టణంలో ఆక్రమణ, అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై విచారణ జరిపి స్వాధీనం చేసుకొని పేదలకు అందజేస్తామని కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం మున్సిపల్ కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విషయం మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. గతంలో జరిగిన అవినీతి, అక్రమాలు, అధిక బిల్లులు, అడ్వాన్స్ నిధులపై విచారణ చేయాలని కోరామన్నారు. పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని, పేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొంగోని వీరన్న, రాయికంటి రాజు, నాయకులు పిల్లల రమేశ్, సాయిని రవి, దేశిని సదానందం , శ్రీహరి, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం


రుక్మాపూర్‌లో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్నేళ్లుగా విద్యాబోధన చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఘు కిషోర్, ఉపాధ్యాయులు శ్రీధర్, మల్లికార్జున్, అంజయ్య, సురేందర్, శ్రీవాణి, ఉమాదేవి, శారద, రోజ, శ్రీనివాస్, రుష్యేంద్రమణి, పుష్పలత, యశోద, సీఆర్‌పీ సురేందర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం ఉద్యమించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

రామడుగు: ప్రజా సమస్యల పరిష్కారం, హామీల అమలు కోసం ప్రతి కార్యకర్త ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల నాయకుడు ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభావం రోజురోజుకు తగ్గిపోతుందని, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలే నిదర్శనమని అన్నారు. కూటమి పక్షాలతో మాత్రమే కేంద్రంలో అధికారం చేపట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నప్పటికీ ప్రజా సమస్యలపై దృష్టి సారించలేకపోతుందని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలుకు నోచుకొని పరిస్థితి నెలకొందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ గెలుపొందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యాడ సృజన్‌కుమార్, టేకుమల్ల సమ్మయ్య, నాయకులు గోడిశెల తిరుపతిగౌడ్, మౌలానా, ఎగుర్ల మల్లేశం, మచ్చ నర్సయ్య, రాజన్న, రవీందర్, రాజేశం, కనకయ్య పలువురు పాల్గొన్నారు.



విద్యార్థుల క్షేత్ర పర్యటన

మానకొండూర్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలన విద్యార్థులు సోమవారం క్షేత్ర పర్యటనలో భాగంగా మండలంలోని లక్ష్మీపంపు హౌజ్, గంగాధర మోడల్ స్కూల్, బొమ్మలగుట్టను సందర్శించారు. లక్ష్మీపంపు హౌజ్‌కు ఎక్కడి నుంచి నీరు వస్తుంది, బొమ్మలగుట్ట, మోడల్ స్కూల్‌కు సంబంధించిన అన్ని విషయాలను తెలుసుకున్నామని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దారి కల్పించాలని వినతి

మానకొండూర్‌రూరల్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని పోచమ్మతల్లి గుడికి దారి కల్పించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గుడికి దారి లేక వెళ్లి, లక్ష్మీపూర్ గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని, దారి కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆషాఢమాసం సందర్భంగా భక్తుల ఇక్కట్లు తొలగించాలన్నారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస్, రవీందర్‌రావు, సతీష్, ప్రశాంత్, రంజిత్ పాల్గొన్నారు.

చొప్పదండిలో పీరీల ఊరేగింపు



చొప్పదండి: పట్టణంలో సోమవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగడిబజార్‌లో ఏర్పాటు చేసిన పీరీలను ఊరేగించారు. డప్పు చప్పుళ్ల మధ్య వీధుల వెంట ఊరేగించగా, భక్తులు కానుకలు సమర్పించారు.

నేత్రదానంపై అవగాహన


జ్ఞాపిక అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

జమ్మికుంట: పట్టణంలోని చిదురాల వెంకటయ్య ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. ఈసందర్భంగా సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన, సంస్మరణ సభ నిర్వహించారు. మరణానంతరం అవయవ దానాలతో ప్రాణదాతలవుతారని తెలిపారు. కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేసి ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్రెపల్లి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

విద్యార్థి స్కూల్ ఫీజు మాఫీ


విద్యార్థికి ఎస్సెస్సీ మెమో అందజేస్తున్న మునీందర్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన ఏగోలపు భారతమ్మ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆమె భర్త మల్లేశం చికిత్స పొందుతున్నాడు. వీరి కుమారుడు ప్రతాప్ గ్రామంలోని అక్షర స్కూల్‌లో పదోతరగతి చదివాడు. స్కూల్ ఫీజు రూ.16 వేలు కట్టాల్సి ఉండగా యాజమాన్యం విద్యార్థి కుటుంబ పరిస్థితి తెలుసుకొని సోమవారం ఫీజు మాఫీ చేయడంతో పాటు స్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునీందర్ విద్యార్థికి పదో తరగతి మెమో అందజేశారు. యాజమాన్యానికి విద్యార్థి కుటుంబ సభ్యులు ధన్యావాదాలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO – 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ – 9618304759
చొప్పదండి : మొండయ్య – 7997958217
మానకొండూర్ : మహేశ్ – 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ – 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899